# వికారాబాద్-కృష్ణారైల్వే లైన్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి

## దక్షిణ మధ్య రైల్వే జీఎంకు సీఎం రేవంత్ సూచన



హైదరాబాద్: వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం సచివాలయంలో సీఎంనుఅరుణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ల అభివృద్ధి, కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చించారు. గతంలో ప్రతిపాదించిన వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ అభివృద్ధిపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఎంతో కాలంగా నిర్లక్ష్యానికి గురైన ఈ మార్గాన్ని పూర్తి చేయాల్సిన అవసరముందని సీఎం సూచించారు. ఈ మార్గాన్ని పూర్తి చేస్తే పరిసర ప్రాంతాల అభివృద్ధి వేగవంతమవుతుందని, పరిశ్రమలను నెలకొల్పేందుకు వీలుంటుందని చెప్పారు.

అలాగే వివేక్ కె.టంకా నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. బృందంలో రాజ్యసభ సభ్యుడు వందన చవాన్, కనకమేడల రవీంద్రకుమార్, దర్శన సింగ్, విల్సన్, లోక్‌సభ సభ్యుడు వీణాదేవి, జస్బీర్‌సింగ్ గిల్, రఘురామ కృష్ణరాజు ఉన్నారు.

# మల్లన్న జాతరకు రహదారులు సరిచేయండి

**- భక్తుల ప్రయాణం సురక్షితంగా ఉండాలి**


**- బిజెపి పార్టీ హనుమకొండ కార్యదర్శి కోటేశ్వర్ రావు**



ఐనవోలు, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఐనవోలు మండలం మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించే సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు సమయం సమీపిస్తోంది. జాతర నిర్వాహకులు ఇప్పటివరకు రహదారులను సరి చేయాలనే ఆలోచన చేయకపోవడం ప్రయాణికులకు సురక్షితం కాదని మంగళవారం బీజేపీ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్ రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మల్లన్న జాతర హాజరయ్యే భక్తులు ఒక్క తెలంగాణ మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొంటారు. భక్తిశ్రద్ధలతో స్వామివారికి మొక్కులు తీర్చుకోవడానికి విచ్చేస్తున్న భక్తులకు రహదారులను సరిచేసి, సురక్షిత ప్రయాణం కల్పించడం నిర్వాహకుల కనీస భాధ్యత అన్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది భక్తులు కొండపర్తి, మొలకలగూడెం, వరంగల్ మార్గంలో సింగారం గ్రామానికి చెందిన దారిలో భక్తులు ప్రయాణిస్తారు. ఆ దారుల్లో రోడ్లు గుటలుగా మారాయి. వాటిని పూడ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా దారులు కనిపించకుండా చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో ప్రయాణికులకు ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొందన్నారు. కాకతీయుల కాలం నాటి కట్టడాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి దేవస్థానానికి తరాలుగా భక్తులు తరలివస్తున్నారు. ఎప్పుడు సంభవించని ప్రమాదాలకు తావివ్వకుండా రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేస్తూ, ముందస్తు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# వాహనాలపై దాడికి పాల్పడ్డ దుండగులు

**- ఆర్టీసీ బస్సు, ఒక్క కారు అద్దాలు ద్వంసం**
**- విచారణ చేపట్టిన పోలీసులు**



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: గుర్తు తెలియని దుండగులు వాహనాలపై రాళ్లతో దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధిలోని జనగాలంచ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు రాళ్లు విసరడంతో ఒక ఆర్టీసీ బస్సు , ఒక కారు అద్దాలు ద్వంసమైనాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై ప్రయాణీకులను విచారించారు. ఇట్టి విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిరాహార దీక్ష చేపట్టిన రైల్వే కార్మికులు

**- సాంఘీభావం తెలిపిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని**



కాజీపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ఖాజీపేట రైల్వే ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో ఓపిఎస్ ను వెంటనే అమలు చేయాలని కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న కార్మికులందరికీ పూలమాలలు వేసి, దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపిఎస్) విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై రైల్వే కార్మికులు చేస్తున్న నిరసన న్యాయపరమైందన్నారు. రైల్వే కార్మికులు భాధ్యతలు నిర్వర్తించి, పదవీ విరమణ పొందుతున్నప్పుడు మనశ్శాంతి లేని పరిస్థితి బిజెపి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల భద్రత పట్ల నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జాతీయ స్థాయిలో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ విధానాలను ప్రవేశపెడితే, నేడు బిజెపి ప్రభుత్వం వ్యాపార దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం ఆస్తులను, సంస్థలను ప్రైవేటు పరం చేయుటకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రజల, కార్మికుల జీవితాలతో ఆటలాడడం ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు మంచిది కాదని సూచించారు. ఇప్పటికైనా కొత్త విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న మూడు నెలల్లో మరోమారు దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుంది. అప్పుడు తప్పనిసరిగా రైల్వే కార్మికుల సమస్యల పట్ల ఓల్డ్ పెన్షన్ (ఓపిఎస్) విధానాన్ని అమలు చేసే విధంగా తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని కార్మికులకు భరోసా ఇచ్చారు. రైల్వే కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

# బిల్ట్ కంపెనీ పునరుద్ధరించాలి

**- ఉద్యోగ కల్పనకు వీలుగా ఉంటుంది**

**- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: ములుగు జిల్లా కమలాపురంలో బల్లాపూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిల్ట్) కంపెనీ పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీనియర్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ మిల్లులో వస్త్రాల తయారీకి ఉపయోగించే కలప గుజ్జు తయారవుతుంది. 2014 లో ఈ మిల్లు మూతపడింది. దీంతో దాదాపు 750 కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. వీరందరికీ ఉపాధి కల్పించటంతో పాటు స్థానికంగా ఉద్యోగ కల్పనకు వీలుగా ఈ మిల్లును తిరిగి పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి చొరవ చూపారు. నేషనల్ కంపెనీలా ట్రిబున్యల్ తీర్పు ప్రకారం ప్రస్తుతం బిల్ట్ కంపెనీ ఆస్తులు ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినంలో ఉన్నాయి. ఆ కంపెని ఎండీ శ్రీ హార్దిక్ పటేల్, ఐటీసీ పేపర్ బోర్డ్స్ డివిజన్ సీఈఓ వాదిరాజ్ కులకర్ణితో పాటు సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో సమావేశమైనారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించాలనే ఆలోచనను వారితో పంచుకున్నారు. ప్రభుత్వం తరఫున తీసుకోవాల్సిన చర్యలు, సాధ్యాసాధ్యాలను చర్చించారు. మిల్లును ఓపెన్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఫిన్‌క్వెస్ట్ బృందాన్ని వారు కోరారు. బిల్ట్ ఆస్తులను కొనుగోలు చేసేందుకు ఐటీసీ కంపెని ఆసక్తి చూపుతోంది. ఫిన్ క్వెస్ట్ కంపెనీ ఐటీసీతో చర్చల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం కోరారు. బిల్ట్ మిల్లును పునరుద్ధరించే ప్రక్రియలో ఐటీసీకి అన్ని విధాలా ప్రభుత్వ సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఐటీసీ చేపట్టిన ప్రాజెక్టులు, భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో సీఎంతో పాటు మంత్రులు అనసూయ సీతక్క, కొండా సురేఖ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి, సీఎంఓ అధికారులు, ములుగు కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ పోటీలో విజేతలుగా నిలిచిన పోలీస్ అధికారులు

**- అభినందించిన వరంగల్ పోలీస్ కమిషనర్**



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో రాణిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన అదనపు డిసిపి పి.సంజీవ్, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి యం.జితేందర్ రెడ్డిలను మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. ఈ నెల 5వ, తేదీ నుండి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన 9వ, రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో 55 సంవత్సరాల వయస్సు విభాగంలో స్పెషల్ బ్రాంచ్ ఏసిపి జితేందర్ రెడ్డి మిక్స్‌డ్ డబుల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. సింగల్స్ విభాగంలో రన్నరప్ నిలవడంతో పాటు డబుల్స్ విభాగంలో అదనపు డిసిపి సంజీవ్‌తో కలిసి ఆడిన డబుల్స్ విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో రన్నరప్ గా నిలిచారు. ఈ పోటీల్లో ఒక గోల్డ్ మెడల్ తో పాటు రెండు సిల్వర్ పతకాలను సాధించారు. ఈ సంవత్సరం మార్చ్‌లో హరియాణాలోని పంచాకుల జిల్లాలో జరగబోయే జాతీయ స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలకు ఏసిపి జితేందర్ రెడ్డి ఎంపికైనారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతాకాలను సాధించి, నేటి తరం క్రీడాకారులకు అదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ పరిశీలించిన వరంగల్ రీజినల్ డైరెక్టర్



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన దరఖాస్తుల నామోదు ప్రక్రియ మంగళవారం ప్రజాపాలన ప్రత్యేక అధికారి వరంగల్ రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్ పరిశీలించారు. నమోదు ప్రక్రియ ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు పాటిస్తూ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గత నాలుగు రోజులుగా వర్ధన్నపేట మున్సిపల్ అధికారులతో కమిషనర్ ఇ. జోనా చేపట్టిన నమోదు ప్రక్రియపై వారు ఆరా తీశారు. కమిషనర్ తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలో 4086 దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీమ్ అధికారి మండల విద్యాశాఖ అధికారి రంగయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అంకుల్.. స్కూల్‌లో వాష్‌రూమ్స్ లేవు

వేములవాడ రూరల్: 'అంకుల్.. మాకు వాష్‌రూమ్స్, మూత్రశాలలు లేవు, ఇబ్బందులు పడుతున్నాం'అని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,

ఎంపీ బండి సంజయ్‌కు మొరపెట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన వికసిత్‌భారత్ సంకల్ప యాత్రకు సంజయ్ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో బాలరాజుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఎంపీకి ఏకరువు పెట్టారు. దీనికి ఆయన స్పందిస్తూ సౌకర్యాలకు ఎన్ని నిధులు అవసరమో ప్రతిపాదనలు 24 గంటల్లో తెలపాలని అధికారులకు సూచించారు.

